క్లుప్తంగా

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు



నీటిని వదులుతున్న సర్పంచ్

సైదాపురం: మండల కేంద్రంలో వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ వెందోటి శారద అన్నారు. స్థానిక ఎంఎస్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన బోరును శనివారం ఆమె ప్రారంభించారు. ఉపసర్పంచ్ బి. శివకుమార్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి తీవ్రగాయాలు



గాయపడిన రత్నయ్య

సైదాపురం: కల్లుగీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. కల్లు గీసుకుంటూ కుటుంబాన్ని పోషించే పొక్కందల గ్రామానికి చెందిన రత్నయ్య యథావిధిగా శనివారం ఉదయం కల్లుగీసేందుకు సమీపంలోని తాటిచెట్టు ఎక్కాడు. కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రత్నయ్యను నెల్లూరు ఆస్పత్రికి తరలించారు.

వడగాలులపై జాగ్రత్తలు తీసుకోండి



కూలీలకు నిమ్మరసం ఇస్తున్న పీడీ

పెళ్లకూరు: ఉపాధి పథకం కింద వేసవిలో పనులు చేస్తున్న కూలీలు ఎండకు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. శనివారం శిరసనంబేడు గ్రామంలో వ్యవసాయ పంట కాలువ పనులను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వల్ల కూలీలకు టార్పాలిన్ పట్టలు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. కూలీలకు నిమ్మరసం పంపిణీ చేశామని చెప్పారు. నిర్దేశించిన కొలతలు ప్రకారం పని పూర్తి చేయడం వల్ల ప్రతిఒక్కరూ రోజుకు రూ.272 పొందే అవకాశం ఉందన్నారు. ఎఫ్ఏ మల్లికార్జున్ పాల్గొన్నారు.

కండలేరులో 32.806 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం 32.806 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు180, హైలెవల్ స్లూయిజ్‌కు 15క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పథకాల పోస్టర్లను ప్రదర్శించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: సచివాలయాల్లో సంక్షేమ పథకాల పోస్టర్లను విధిగా ప్రదర్శించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. రామసాగరం గ్రామసచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లను సచివాలయాల గోడలకు తప్పక అంటించాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 3నుంచి 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. గృహనిర్మాణ శాఖ ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న ఏఓ భవాని

చిల్లకూరు: వరుస పంటలు సాగు చేసే రైతులు ఎప్పటికప్పుడు భూసారాన్ని పెంపొందించుకోవాలని అందుకు ప్రతి ఏడాది భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయశాఖాధికారి గూడూరు భవాని తెలిపారు. వల్లిపేడు రైతు భరోసా కేంద్రం పరిధిలో శనివారం మట్టి నమూనాలను సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్బీకేల పరిధిలో ఇప్పటికే మట్టి నమూనాలను సేకరించామని వీటి నమూనాలను ల్యాబ్‌కు పంపి ఫలితాలు వచ్చిన అనంతరం ఎలాంటి రసాయన ఎరువులు వాడాలో రైతుకు తెలియజేస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు వేదాద్రి, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన

- గడప గడపకు మన ప్రభుత్వంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బాలాయపల్లి పంచాయతీలోని చుట్టి, బాలాయపల్లిలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. రామ్‌కుమార్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి రామ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి వివరించి బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, సతీమణి రాజ్యలక్ష్మి హయాంలో జరిగిన అభివృద్ధిపనులను గుర్తు చేసుకుంటూ గ్రామ ప్రజలు శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలుకుతూ నేదురుమల్లిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలను నేదురుమల్లి దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు, వెందోటి కార్తీక్‌రెడ్డి, కరణం రమేష్‌నాయుడు, రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు, రంగనాథం, మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్ బాబి, నేతలు గోపికృష్ణారెడ్డి, దేవిక చౌదరి, వేళ్ల సురేంద్ర, వెందోటి హరికృష్ణారెడ్డి, అల్లంరాజు, శేఖర్, రామతులసి, న్యాయవాది కోటేశ్వరరావు, చిట్టేటి హరికృష్ణ, పీఎంఆర్ పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 4గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఊజంల్‌సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈఓకు నగదు అందజేస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి శనివారం నెల్లూరు జిల్లా అల్లిపురానికి చెందిన రామిరెడ్డి రఘురామిరెడ్డి, కావ్య రూ.లక్ష విరాళంగా అందించినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆలయ అధికారులు దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

హెల్మెట్ ధరించి ప్రయాణించండి



ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

చిల్లకూరు: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని చిల్లకూరు ఎస్‌ఐ గోపాల్ సూచించారు. మండలంలోని కోట క్రాస్‌రోడ్డు వద్ద శనివారం తనిఖీలు నిర్వహించి పలువురు ద్విచక్రవాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన వాహన చోదకులతో మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ తప్పక ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని, రోడ్డు నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు లేకుండా గమ్యం చేరుకోవచ్చని తెలిపారు.

25న గంధమహోత్సవం

నాయుడుపేట:పట్టణ పరిధిలోని శ్రీహజరత్ ఖాదర్‌షావలి చిన్నదర్గా 39వ (ఉరుసు) గంధమహోత్సవం ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు శనివారం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 25న గంధమహోత్సవం, 26న అన్నదాం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

వెంకటగిరి: పట్టణంలోని ఆర్‌పీఎం ఉన్నత పాఠశాల సమీపంలో వెంకటగిరి మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. మిత్రమండలి సభ్యులు అడపాలగోపి, రమేష్, కోటి, శ్రీను మాట్లాడుతూ ఎండల తీవ్రత కారణంగా పట్టణం, ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చిన వారికి ఉపశమనం కలిగేలా మజ్జిగ పంపిణీ ప్రారంభించామని తెలిపారు.

రాడార్‌ను సందర్శించిన విద్యార్థులు



రాడార్ కేంద్రంలో విద్యార్థులు

సూళ్లూరుపేట రూరల్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహిస్తున్న యువికా -2023 కార్యక్రమంలో భాగంగా దేశంలోని 56 మంది విద్యార్థులను శ్రీసిటీలోని యుసూజీ కంపెనీ, తిరుపతి సమీపంలోని గాదంకి వద్ద గల రాడార్ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. యువికా -2023 కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులకు షార్ కేంద్రం ద్వారా ఆతిథ్యం ఇచ్చి పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ప్రాంతాలను సందర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షార్ గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం



బిడ్డను కుటుంబసభ్యులకు ఇస్తున్న ఈఎంటీ క్రిష్ణ

చిల్లకూరు: గూడూరు రూరల్ పరిధిలోని వెడిచెర్ల గ్రామానికి చెందిన ఓ గర్భిణి 108 వాహనంలో సుఖ ప్రసవం జరిగి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు.. వెడిచెర్ల గ్రామానికి చెందిన తిరుమలశెట్టి నాగార్జున భార్య వెంకటరమణమ్మ రెండవ కాన్పు చేయించుకునేందుకు ఆస్పత్రికి బయలు దేరుతుండగా ప్రసవ నొప్పులు విపరీతంగా వచ్చాయి. దీంతో కుటుంబసభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. వాకాడు మండలానికి చెందిన 108 వాహనం అక్కడకు చేరుకుని ఆమెను గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చిల్లకూరు వద్దకు వచ్చే సరికే ఆమెకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో 108 ఈఎంటీ క్రిష్ణ, పైలట్ సనత్, కుటుంబసభ్యుల సహకారంతో వాహనంలోనే కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు ఆమె జన్మనివ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాహనంలోనే కాన్పు చేసిన ఈఎంటీ, పైలట్‌లను కుటుంబసభ్యులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సాయినాథ్

గూడూరు: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ కోరారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాలవ్యనగర్ సచివాలయంలో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను శనివారం సాయినాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ అమ్మే దుకాణాలపై పలుమార్లు దాడులు చేసి అపరాధ రుసుం విధించినా పూర్తి స్థాయిలో నిర్మూలన కావడం లేదన్నారు. ఇళ్లలో పనికిరాని వస్తువులు, దుస్తులు శానిటరీ వర్కర్లకు ఇస్తే వారు ఆర్ఆర్ఆర్ సెంటర్ వద్ద అవసరమైన వారికి అందజేస్తారని లేదా రీసైక్లింగ్ చేస్తారని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మైక్‌బాషాను పరామర్శిస్తున్న నేదురుమల్లి



గురుమూర్తి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కిలివేటి

వెంకటగిరి: వెంకటగిరికి చెందిన పటాన్ పకీర్‌ఖాన్ (మైక్‌బాషా) కుమారుడు కువైట్‌లో ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం మైక్‌బాషా నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరా మర్శించిన వారిలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఢిల్లీబాబు ఉన్నారు.

ఎమ్మెల్యే సంజీవయ్య పరామర్శ

నాయుడుపేట: పుదూరు మాజీ సర్పంచ్ గోనుపల్లి గురుమూర్తిని శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. గురుమూర్తి తల్లి గోనుపల్లి పాపమ్మ(85) శుక్రవారం కన్నుమూశారు. దీంతో ఎమ్మెల్యే సంజీవయ్య పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో పుదూరుకు చేరుకుని పాపమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గురుమూర్తి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, కలికి మాధవరెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కిశోర్‌యాదవ్, నేతలు రాజేష్, హరినాథ్‌రెడ్డి, బలరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రహంతుల్లా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ నరసింహరావు, సుబ్బారెడ్డి ఉన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌తో అందరికీ మేలు



వస్తువులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేట: మెప్మా అర్బన్ మార్కెట్‌తో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను చైర్‌పర్సన్ చేతులమీదుగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు సమష్టిగా ముందుకు కొనసాగించాలన్నారు. ప్రజలందరూ వస్తువులను కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే అర్బన్ మార్కెట్‌లో పొదుపు సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులు విక్రయిస్తారని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 54మందికి రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, ఈటీలు వెంకటరమణ, జయరామ్, సీఓ ప్రభాకర్, డీఈఓ హర్ష పాల్గొన్నారు.

ఆక్వా సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: నియోజకవర్గంలోని తీరప్రాంత మండలాల్లో ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఆక్వాకు విద్యుత్ చార్జీలు తగ్గిస్తూ యూనిట్ రూ.1.50 వంతున ఇస్తున్నా కొన్ని చోట్ల ఆక్వా రైతుల నుంచి రూ.4.50 వంతున వసూలు చేస్తున్నారన్నారు. దీంతో చిన్నపాటి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను పరిష్కరించే దిశగా నిధులు విడుదల చేయాలని కోరారు. చెన్నూరు, విందూరులో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కానిస్టేబుల్‌కు జిల్లా ఎస్పీ ప్రశంసలు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాంబాబు

చిల్లకూరు: చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని తన బైక్‌లో సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపడినందుకుగాను శనివారం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి కానిస్టేబుల్ రాంబాబును అభినందించి ప్రశంసాపత్రం అందించారు. మండలంలోని జాతీయ రహదారిపై ఈనెల 5న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా ఓ వ్యక్తి గాయపడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే ఆ సమయంలో సెంట్రీ డ్యూటీలో రాంబాబు ఒక్కరే ఉన్నారు. అయినా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికుల సహకారంతో గూడూరు ఏరియా ఆస్పత్రిలో చేర్పించి అతని ప్రాణాలను కాపాడారు. విషయం తెలిసి ఎస్పీ తిరుపతిలోని తన కార్యాలయానికి పిలిపించి రాంబాబును ప్రశంసాపత్రంతో సత్కరించారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చిట్టమూరు: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం రాత్రి మల్లాం గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీభవాని తెలిపిన వివరాల మేరకు.. వాకాడు మండలం వల్లమేడు గ్రామానికి చెందిన శేషాద్రి కొత్తగుంట గ్రామంలో ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని శనివారం రాత్రి స్వగ్రామం వల్లమేడుకు ద్విచక్రవాహనంలో వెళుతున్నాడు. అదే సమయంలో ఎదురుగావస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న శేషాద్రి తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానికులు 108లో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన ఓజిలి గ్రామానికి చెందిన వ్యక్తిని, కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన చుక్కల దుప్పి

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి శనివారం మృతిచెందింది. అటవీశాఖాధికారి మురళి వివరాల మేరకు.. మండలంలోని అటవీ ప్రాంతంలోని చుక్కల దుప్పి నీటి కోసం జాతీయ రహదారిని దాటే క్రమంలో చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందింది. దుప్పి కళేబరాన్ని పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించిన అనంతరం చిల్లకూరు పశువైద్యులు ధాత్రి సహకారంతో పోస్టుమార్టం చేయించి సమీపంలోని అటవీ ప్రాంతంలో దుప్పి కళేబరాన్ని దహనం చేశామని తెలిపారు.